

ప్రొ॥డి.ఎం, రవి ప్రసాద్
చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్

నిజం మా నైజం

# మెరిట్

ఆదివారం, 29 జూన్ 2025

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్ : రాజు పటేల్ పెంచాల సౌజన్యంతో.. (Sr.Journalist) MERIT BROD COSTING PVT LTD. CIN.U2219TG2017PTC120821

Hydrabad, ananthapoor, guntur, nellore, rajamandri, rajamahendravaram,Suryapet,siddipet, warangal, Karimnagar, kammam, Kurnool, Kadapa, nizamabad, vizag, Vijayawada, Tirupathi, Chennai, Bengaluru.



MERIT TV

MERIT BROD COSTING PVT

జిల్లాల వారీగా జిల్లా ఒక్కంటికి డిస్టిక్ డైరెక్టర్, మరియు స్టాఫ్ రిపోర్టర్లు నియోజకవర్గ ఇన్చార్జీలు మండలాల వారిగా మండల రిపోర్టర్లు తదితరులకు అవకాశం కలదు ఆసక్తి గలవారు మాత్రమే సంప్రదించండి.

9390143786


## అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'

### శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా

శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ

భారత మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఇది తొలి అడుగు అని పేర్కొన్న ప్రధాని

అంతరిక్షం నుంచి చూస్తే భూమిపై సరిహద్దులే కనిపించవన్న శుక్లా





హైదరాబాద్ బ్యూరో, మెరిట్

భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. శుభాంశు శుక్లా ప్రయాణం దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని కొనియాడారు. "మీరు మిషన్ కోసం భౌతికంగా దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, 140 కోట్ల మంది భారతీయుల హృదయాలకు చాలాదగ్గరగా ఉన్నారు. మీ ఈ చారిత్రక యాత్ర ఒక నూతన శకానికి నాంది పలుకుతుంది.

- కొనసాగింపు 2లో..

**భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు.**

## రాజ్యాంగం నుంచి 'లౌకికవాదం', 'సోషలిజం' పదాలు తొలగించాలి

### అసోం సీఎం హిమంత బిశ్వశర్మ



*"మనం అత్యవసర పరిస్థితి గురించి మాట్లాడేటప్పుడు, దాని మిగిలిన ప్రభావాన్ని తొలగించడానికి ఇదే సరైన సమయం, ప్రధాన మంత్రి మోదీ వలసపాలన వారసత్వాన్ని తుడిచి వేయడానికి కృషి చేస్తున్నట్లే. లౌకికవాదం సర్వ ధర్మ సంభవ అనే భారతీయ ఆలోచనకు విరుద్ధంగా ఉందని నేను నమ్ముతున్నా. సోషలిజం నిజంగా మన ఆర్థిక దృష్టి కాదు, మా దృష్టి ఎల్లప్పుడూ సర్వోదయ అంత్యోదయంపైనే ఉంది"* - హిమంత బిశ్వశర్మ, అసోం సీఎం

హైదరాబాద్ బ్యూరో, మెరిట్

రాజ్యాంగంలో ఉన్న లౌకికవాదం, సోషలిజం పదాలను తొలగించాలని అసోం ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ కోరారు. వాటిని తొలగించడానికి ఇదేసరైన సమయమని అన్నారు. ఆ పదాలు అసలు రాజ్యాంగంలో భాగం కాదని చెప్పారు. ఎందుకంటే లౌకికవాదం సర్వ ధర్మ సంభవ అనే భారతీయ ఆలోచనకు

- కొనసాగింపు 2లో..

## తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు..

### 44 మందికి స్థానచలనం



హైదరాబాద్ బ్యూరో, మెరిట్ : తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై.నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్‌కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ప్రపంచంలోని నగరాలతో.. హైదరాబాద్ పోటీ

### ఎన్ని ఆటంకాలు ఎదురైనా - కంచ గచ్చిబౌలి అభివృద్ధి ఆగదు



- కంచ గచ్చిబౌలిలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల మందికి ఉద్యోగాలు
- ప్రపంచంలోని నగరాలతో హైదరాబాద్ పోటీ
- రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యంతో ముందుకు

హైదరాబాద్ బ్యూరో, మెరిట్

ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించి కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడి భూముల్లో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమేనని అన్నారు. కంచ గచ్చిబౌలిలో కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన పోరాటాల వల్లే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు వచ్చాయని తెలిపారు. ఎప్పుడు పిలిచినా పలికే పేదల నాయకుడిగా ఎంతో గొప్ప పేరు సంపాదించారని చెప్పారు. హైదరాబాద్ దోమలగూడలోని పీజేఆర్

- కొనసాగింపు 2లో..

## తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం

### బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చివరి దశకు

- రెండు తెలుగు రాష్ట్రాలకు ఒకేసారి కొత్త అధ్యక్షులు
- తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు రేపు నోటిఫికేషన్
- ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం
- జులై 1 నాటికి కొలిక్కి రానున్న అధ్యక్షుల ఎంపిక
- విజయవాడలో షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి



హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్): బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు నూతన అధ్యక్షులను

- కొనసాగింపు 2లో..

## ఆగస్టు 15 నుంచి.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

### మహిళలకు ఉచిత బస్సు పథకంపై సీఎం చంద్రబాబు కసరత్తు

### ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్లు బస్సులు ఏర్పాటు



అమరావతి బ్యూరో, మెరిట్ :

మహిళలకు కల్పించే ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు నడపాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆర్థికంగా భారమైనా ఆగస్టు 15 నుంచే ఈ పథకం అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇకపై ఆర్టీసీలో ఈవీ ఏసీ బస్సులే ప్రవేశపెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై సీఎం చంద్రబాబు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

**ప్రతీ బస్సుకు జీపీఎస్:** రాష్ట్రంలో బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు కొత్త బస్సులు కొనడం, అవసరమైతే అద్దెకు తీసుకోవడం కానీ

- కొనసాగింపు 2లో..


FOREVER MATRIMONY

Offer. Offer registration fee only 1000/-

ప్రతి జిల్లాలో మీ అభిరుచికి అనుగుణంగా తగిన చక్కని సాంప్రదాయమైన వధూవరులను ఒక్క క్లిక్తోతో సొంతం చేసుకోండి. Just once click www.forevermatrimony.in అన్ని అన్ని వర్గాల అన్ని కులాల అన్ని మతాల వారికి అనువైన ప్రాంతాలలో తగిన సంబంధాలు ఇక్కడ పొందుపరచబడినవి అన్వేషణ కొనసాగించండి

మరిన్ని వివరాలకు కాల్ చేయండి

9676488007

## రాజ్యాంగం నుంచి 'లౌకికవాదం', 'సోషలిజం' పదాలు తొలగించాలి

- మొదటిపేజీ కొనసాగింపు..

విరుద్ధంగా ఉందని, సోషలిజం భారతదేశ అసలు ఆర్థిక దృష్టిలో ఎప్పుడూ భాగం కాదని అభిప్రాయ పడ్డారు.

**అత్యవసర పరిస్థితి సమయంలో పోరాటం!**

రాజధాని గువాహటిలోని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్: ఇయర్స్ దట్ ఫోర్జ్ ఎ లీడర్' అనే పుస్తకాన్ని హిమంతబిశ్వశర్మ ఆవిష్కరించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ది ఎమర్జెన్సీ డైరీ అనే పుస్తకాన్ని విడుదల చేశామని, ఇది అత్యవసర పరిస్థితి సమయంలో పోరాటం గురించి తెలియజేస్తుందని చెప్పారు. "లౌకికవాదం, సోషలిజం అనే పదాలను ప్రవేశిక నుంచి తొలగించాలని నేను భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను, ఎందుకంటే అవి అసలు రాజ్యాంగంలో భాగం కావు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ వాటిని చేర్చారు" అని హిమంత బిశ్వశర్మ అన్నారు. అత్యవసర పరిస్థితి వల్ల దేశానికి జరిగిన నష్టాల గురించి చర్చించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. అత్యవసర పరిస్థితిని మరచిపోకూడదని, ఎందుకంటే దాన్ని మరోసారి పునరావృతం చేయలేమని చెప్పారు. ఎమర్జెన్సీ డైరీస్ పుస్తకం ప్రధాని మోదీ ప్రజాస్వామ్య ఆదర్శాల కోసం పోరాడుతున్న దృశ్యాన్ని, దానిని పరిరక్షించడానికి ఆయన చేస్తున్న కృషి చేశారో స్పష్టంగా చిత్రీకరిస్తుంది.

## తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం

- మొదటిపేజీ కొనసాగింపు..

ఎన్నుకునేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెండు రాష్ట్రాలకు దాదాపు ఒకే సమయంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, జులై 1న నూతన సారథులను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాయి.తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం (జూన్ 29) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం (జూన్ 30) అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం జులై 1వ తేదీన ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారు.

**ఏపీలోనూ మొదలైన ప్రక్రియ**

ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తిచేయాలనిపార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ వివరాలను పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశంలో వెల్లడించారు. జూన్ 30న నామినేషన్ల స్వీకరణ ఉంటుందని,అదేరోజు సాయంత్రం లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. జులై 1వ తేదీ నాటికి పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## అంతరిక్షంలో..




- మొదటిపేజీ కొనసాగింపు..

ఇది మన దేశ మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు మొదటి అడుగు వంటిది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే భారత విద్యార్థుల ఆకాంక్షలకు మీ విజయం మరింత బలాన్నిస్తుంది" అని శుక్లాను ఉద్దేశించి ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం వికసిత భారత్ లక్ష్యానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ప్రశంసలకు శుభాంశు శుక్లా వినమ్రంగా స్పందించారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, యావత్ భారతదేశం సాధించిన సమష్టి విజయమని అన్నారు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వకారణంగా ఉంది. ఇక్కడి నుంచి మన దేశాన్ని మొదటిసారి చూసినప్పుడు, మ్యాప్‌లో చూసిన దానికంటే ఎంతో పెద్దదిగా, మహోన్నతంగా కనిపించింది. ఈ భూమి అంతా ఒకే ఇల్లు, మనమంతా ఒకే కుటుంబం అనే భావన కలుగుతోంది. ఇక్కడి నుంచి చూస్తే దేశాల మధ్య సరిహద్దులు, విభజన రేఖలు కనిపించవు, అంతా ఏకత్వమే కనిపిస్తుంది" అని తన అనుభూతిని పంచుకున్నారు. అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

# సీతారాములపై ఒట్టేసి చెప్పు.. ఆసుపత్రి నిర్మిస్తా అన్నావా..లేదా..?

**ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేత ఎం.యుగంధర్ రెడ్డి సూటి ప్రశ్న**



బాలానగర్(మేడ్చల్), జూన్ 28(మెరిట్):

బాలానగర్ ప్రాంత పేద ప్రజల పట్ల కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చిన్న చూపు చూస్తూ ఏమాత్రం పట్టించుకోకుండా తాను నివసించే కూకట్పల్లి ప్రాంతం వైపు అధికంగా శ్రద్ధ చూపిస్తున్నాడని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ కూకట్పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని గత సంవత్సరం నుండి నిధులు వేచించి 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కాకుండా, స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే చేసిన కృషి, బాలానగర్ లో 100 పడకల ఆసుపత్రి కట్టిస్తా అని చెప్పిన మాటపై ఎందుకు అంతగా శ్రద్ధ చూపించలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా బాలానగర్ లోని 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టిస్తానని అనేక ఎన్నికల బహిరంగ సభల్లో చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. బాలానగర్ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఆసుపత్రిపై ప్రత్యేకమైన కృషి ఎందుకు చేయలేదని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తాను చెప్పేది అబద్ధం అయితే, బాలానగర్ లోని 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో 100 పడకల ప్రభుత్వం ఆసుపత్రి నిర్మిస్తా అని అనలేదని ఎమ్మెల్యే తన సొంత నిధులతో నిర్మించిన సీతారాముల వారి దేవాలయంపై ఒట్టు వేసి చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆడుతున్న డ్రామాలను దయచేసి గమనించాలని కోరారు. బాలానగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించినట్లయితే స్థానిక పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాది మంది కార్మిక కుటుంబాలు వైద్యంకు నోచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలానగర్ ప్రాంత పేద ప్రజలకు వైద్యం అక్కర లేదని కూకట్పల్లి లో ప్రభుత్వ ఆసుపత్రిని కట్టించడం ఎంత విడ్డూరంగా ఉందో బాలానగర్ ప్రాంత ప్రజలు దయచేసి గమనించాలని కోరుతూ పిలుపునిచ్చారు. కూకట్పల్లికి అంత శ్రద్ధ వహించినప్పుడు, బాలానగర్ కు ఎందుకు అంత శ్రద్ధ తీసుకోలేదు, అంటే ఎమ్మెల్యేకు బాలానగర్ ప్రాంత ప్రజలు కూడా ఓట్లు వేసి గెలిపించలేదా..?

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- మొదటిపేజీ కొనసాగింపు..

చేయాలని సీఎం సూచించారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే ఉండాలని, ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని అలానే ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని అధికారులకు నిర్దేశించారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని, ఖర్చుఎలా తగ్గించుకోవాలి,ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్నీ పరిశీలించాలని సీఎం సూచించారు. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్ ఇలా బస్సుల కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించాలన్నారు. ఆర్టీసీనే పవర్ జనరేట్ చేసి ఈవీ బస్సులు వినియోగించగలిగితే ఎంతమేర మెయింటెనెన్స్ కాస్ట్ తగ్గుతుందనేది అంచనా వేయాలన్నారు.

**2,536 బస్సులు, రూ.996 కోట్లు వ్యయం:** కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారని వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఆ సంఖ్య 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు సీఎంకి వివరించారు. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉందని పథకం అమలు తర్వాత 13.39 కోట్లకు పెరగొచ్చునని అంచనా వేశారు. మొత్తంగా ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుందని అధికారులు తెలిపారు.

**ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానం:** ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. ఒక్కోరాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయన్నారు. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా సీఎం చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోందన్నారు.

# కార్మికులను బానిసలు చేసే 4 లేబర్ కోడ్‌లను రద్దు చెయ్యాలి

**జులై 9న దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్ విడుదల**




బాలానగర్(మేడ్చల్), జూన్ 28(మెరిట్):

బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తూ కట్టు బానిసలు చేసే 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చెయ్యాలని జులై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చెయ్యాలని పారిశ్రామిక కార్మికులు, జిహెచ్ఎంసి కార్మికుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ దేశంలోని సంఘటిత రంగమైన కార్మికులు, అసంఘటిత రంగమైన కార్మికులు స్కీం వర్కర్లు వ్యవసాయ కార్మికులు, రైతు కూలీలు సమస్త కార్మిక వర్గం ఐక్యం కావలసిన సమయం జులై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మె అని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా బడా కార్పొరేట్ లకు దేశాన్ని తాకట్టు పెట్టాలనే ఉద్దేశంతో చట్టాలలో మార్పులు తెస్తూ బడా కార్పోరేట్లకి అనుకూలమైన విధంగా చట్టాలను మార్చుతూ దేశా కార్మిక వర్గాన్ని బానిసలుగా చేయడమే కేంద్ర ప్రభుత్వ వైఖరి లా కనిపిస్తుంది. 44 చట్టాలుగా ఉన్న కార్మిక చట్టాలను 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోల్డ్ తెచ్చుతూ బడా కార్పొరేట్ యాజమాన్యాలకు మేలు చేసే విధంగా చట్టాలను తీసుకురావడం దుర్మార్గమని కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. శ్రమ దోపిడి గురవుతున్నాను శివకుదగ్గ వేతనం కావాలని అడిగే అవకాశం లేకుండా చట్టంలో మార్పు తెస్తున్నారు. కార్మికులందరూ ఐక్యంగా యూనియన్ పెట్టుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవాలని అనుకుందామంటే యూనియన్ పెట్టుకోకుండా చట్టాలను తెస్తున్నారు. యజమానికి కార్మికుడ్ని తనకు వచ్చినప్పుడు ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం చేస్తూ చట్టం చేస్తున్నారు ఇలాంటి లేబర్ కోడ్లు యాజమాన్యాలను బతికించడమే తప్ప కార్మికుల నట్టేట ముంచేయడమే ఈ దేశ వ్యాప్త సమ్మెతో బిజెపి కేంద్ర ప్రభుత్వం అహంకారాన్ని తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, లక్ష్మణరావు,మోహన్, నాగరాజు, మూర్తి, లక్ష్మి, అనంతమ్మ పాల్గొన్నారు.

## ప్రపంచంలోని నగరాలతో..

> "ప్రపంచంలోని నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి చేస్తే 5 లక్షల ఉద్యోగాలు వస్తాయి. హైదరాబాద్‌పై ఒత్తిడి పెరుగుతున్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని చేపట్టాం. 2029 లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం నాలుగు నియోజకవర్గాలుగా మారబోతోంది. అందరికీ అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం వస్తుంది."
> – రేవంత్ రెడ్డి, సీఎం

- మొదటిపేజీ కొనసాగింపు..

ఇల్లు ఒక జనతా గ్యారేజీగా కనిపించేదన్నారు. 'పీజేఆర్ కృషితోనే హైటెక్ సిటీ గచ్చిబౌలికి మంజూరైంది. హైటెక్ సిటీకి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన పునాదిరాయి వేస్తే, చంద్రబాబు దాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారు అని సీఎం గుర్తు చేశారు.

**ప్రపంచ నగరాలతో పోటీ :** 'ప్రపంచంలోని నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతోంది. ఎంత మంది రాక్షసులు అడ్డుపడినా మా యజ్ఞం ఆగదు. రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యంతో మాతో అందరూ కలిసి వస్తున్నారు. 3 లేయర్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని విభజించాలనుకున్నాం. రాబోయే 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి అని సీఎం స్పష్టం చేశారు.

**నగరాలు నేర్పిన పాఠాలు :** కాలుష్యం కారణంగా నేడు ఢిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షాకాలంలో వానలు కురిస్తే చెన్నై నగరం అతలాకుతలమవుతోంది. మరోవైపు బెంగళూరు నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి' అని సీఎం అన్నారు.

**కాలుష్యం తగ్గించేందుకు కార్యాచరణ :** హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు సీఎం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు తీసుకున్నామని తెలిపారు. నగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తామన్నారు. ఎలక్ట్రిక్ కార్లు,ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నామని చెప్పారు. నగరంలోని నాలాలు కబ్జాలకు గురవడం వల్లే ముంపు సమస్య తీవ్రత పెరిగిందని, చెరువుల్లో అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చి వేసిందని గుర్తు చేశారు. వరద నీళ్లు వెళ్లేందుకు చెరువుల్లేకుండా కొందరు కబ్జాలు చేశారని మండిపడ్డారు. బతుకమ్మకుంటను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకుంటే, కబ్జా నుంచి విడిపించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా కోర్టు భవనం పైనుంచి దూకిన కుటుంబం.. ఒకరి మృతి

మెదక్ బ్యూరో, జూన్ 28(మెరిట్):

తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మెదక్ జిల్లా కోర్టు భవనం పైనుంచి దూకి ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శనివారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల ప్రకారం, దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి కోర్టు భవనం పైకి చేరుకొని, అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ దుర్ఘటనలో భార్య మృతి చెందగా, భర్త మరియు ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులను దౌలతాబాద్ గ్రామ వాసులుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న దర్యాప్తు ప్రారంభించారు.

## అలిపిరి వద్ద భారీగా ట్రాఫిక్ జామ్..

తిరుమల బ్యూరో, జూన్ 28(మెరిట్):

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో ఉదయం నుంచే భక్తుల రాక అనూహ్యంగా పెరిగింది. ఫలితంగా అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. భక్తులు గంటల తరబడి వాహనాల్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలకు ప్రవేశ ద్వారమైన అలిపిరి వద్ద వాహనాల తనిఖీ ప్రక్రియ ఆలస్యం కావడంతో, వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. అలిపిరి గరుడ కూడలి వరకు వాహనాల వరుసలు కనిపిస్తున్నాయి. దీంతో శ్రీవారి దర్శనానికి వెళ్తున్న యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, తిరుమలకు వెళ్లే రెండో కనుమ రహదారిలో మరమ్మతు పనులు జరుగుతుండటం కూడా ట్రాఫిక్ నెమ్మదించడానికి ఒక కారణంగా తెలుస్తోంది. ఈ మరమ్మతుల వల్ల ఆ మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. వారాంతపు రద్దీకి ఘాట్ రోడ్డు మరమ్మతులు తోడవడంతో, శ్రీవారి భక్తులకు ప్రయాణంలో తీవ్ర జాప్యం తప్పడం లేదు. అధికారులు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పరిస్థితి అదుపులోకి రావడం లేదు.

## నిజాలు బయటపడుతుంటే ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది..

**మహా న్యూస్ కు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి : షర్మిల**

హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్):

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వార్తలు ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను వెలికితీస్తున్న మీడియా సంస్థపై భౌతిక దాడులకు దిగడం అప్రజాస్వామికమని ఆమె అన్నారు. "తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలను ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై, బీఆర్ఎస్ గూండాల దాడిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఛానెల్‌లో పనిచేసే సిబ్బందిపై, ముఖ్యంగా మహిళా జర్నలిస్టుల మీద దాడి హేయమైన చర్య. ఇలాంటి దాడులు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాయి. నా ఫోన్ ట్యాప్ చేశారు. ట్యాప్ చేసిన ఆడియోనే వైవీ సుబ్బారెడ్డి గారు నాకు వినిపించారు. ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్లు... ఫోన్ ట్యాపింగ్ విషయంలో మీ దొంగ చెవులను పసిగడుతుంటే దాడులకు దిగుతారా? వాస్తవాలు చెప్పే వాళ్లను చంపాలని చూస్తారా? అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరి ఫోన్లనైనా ట్యాప్ చేయవచ్చా? అడిగినోళ్లకు సైతం ట్యాప్ చేసిన కాల్ రికార్డ్స్ పంపవచ్చా? దొంగతనంగా ఫోన్లు ట్యాప్ చేసి నీచానికి ఒడిగడతారా? తీగ లాగుతుంటే డొంక కదులుతుంది అన్నట్లు సిట్ విచారణలో నిజాలన్నీ బయట పడుతుంటే, ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది. తక్షణమే మహా న్యూస్ యాజమాన్యానికి బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

# తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం

## మంత్రి కారును ఢీకొట్టిన మరో కారు

**జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలంలో తప్పిన ప్రమాదం**
**ఊడిపోయిన కారు టైరు.. మరో కారులో ఇంటికి వెళ్లిన మంత్రి**



హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్): తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రమాదం నుండి త్రుటిలో తప్పిం చుకున్నారు జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలం మారుతీ నగర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై మంత్రి ప్రయాణిస్తుండగా... ఆయన కారును మరో కారు ఢీకొట్టింది. దాంతో ఆయన కారు టైరు ఊడిపోయింది. ఈ ప్రమాదం నుంచి మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. కారు ప్రమాదానికి గురికావడంతో ఆయన మరో వాహనంలో తన నివాసానికి చేరుకున్నారు. ఆయన కొద్ది రోజుల క్రితమే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించిన క్రమంలో ముగ్గురికి అవకాశం లభించగా, వారిలో అడ్లూరి లక్ష్మణ్ ఒకరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

# స్థానికసంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు!

## ప్రభుత్వ వ్యూహం ఖరారు

స్థానికసంస్థల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ అమలుపై మార్గాలు అన్వేషిస్తోంది. 30 రోజుల్లో పంచాయతీల్లో రిజర్వేషన్లను తేల్చాలని హైకోర్టు ఆదేశించడంతో అధికారులు, న్యాయనిపుణులతో ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. రాష్ట్రపతి నుంచి స్పందనలేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలా? బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తూ జీవో ఇవ్వాలా? అని ఆలోచిస్తున్నట్లు సమాచారం. అవేమీ వీలుకాకపోతే పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు జరిపి పార్టీ పరంగా 42శాతం సీట్లు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.




**30 రోజుల్లో పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టం :**

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ దిశగా కులగణన చేసింది. ఆ సమాచారం ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించి గవర్నర్‌కు పంపారు. ఐతే సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితి దాటుతున్నందున నిర్ణయం కోసం రాష్ట్రపతికి గవర్నర్ నివేదించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలంటే తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాల్సి ఉంటుంది.

ఏప్రిల్‌లో బిల్లు పంపినా రాష్ట్రపతి భవన్ నుంచి ఇప్పటివరకు స్పందన రాలేదు. ఇదే సమయంలో పంచాయతీ ఎన్నికలను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను 20 రోజుల్లోనే కొలిక్కి తెస్తామని ప్రభుత్వమే చెప్పడంతో 30 రోజుల్లో పూర్తి చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ మేరకు స్థానికసంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలని ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

**రిజర్వేషన్లు పెంచితే న్యాయపరంగా చిక్కులు వస్తాయన్న అభిప్రాయం! :**

న్యాయపరమైన చిక్కులురాకుండా రాజకీయంగా నష్టం జరగకుండా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. హైకోర్టు గడువు దృష్ట్యా దిల్లీకి బృందాన్ని పంపించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆలోచిస్తోంది. ఒకవేళ రిజర్వేషన్లు తేలకపోయినా రాజకీయంగా ప్రయోజనాలు ఉంటాయని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యేక జీవో ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వొచ్చా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఐతే అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు పెండింగ్‌లో ఉండగా జీవోల ద్వారా రిజర్వేషన్లు పెంచితే న్యాయపరంగా చిక్కులు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులు వేచి చూసి రాష్ట్రపతి నుంచి స్పందనరాకపోతే సుప్రీంకోర్టుని ఆశ్రయించాలనే కోణంలోనూ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వాల నుంచి వచ్చిన బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల్లో క్లియర్ చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు పేర్కొన్నందున ఆ మేరకు సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లొచ్చా అనే అంశంపై న్యాయనిపుణులతో సమాలోచనలు చేస్తోంది.

స్థానికసంస్థల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ అమలుపై మార్గాలు అన్వేషిస్తోంది. 30 రోజుల్లో పంచాయతీల్లో రిజర్వేషన్లను తేల్చాలని హైకోర్టు ఆదేశించడంతో అధికారులు, న్యాయనిపుణులతో ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. రాష్ట్రపతి నుంచి స్పందనలేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిం చాలా? బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తూ జీవో ఇవ్వాలా? అని ఆలోచిస్తున్న ట్లు సమాచారం.

**ఐదారు రోజుల్లో వ్యూహం ఖరారు :**

ఆ ప్రయత్నాలేవి ఫలించకపోతే పాత విధానంలో బీసీలకి 23శాతం రిజర్వేషన్ తోనే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. అప్పుడు పార్టీ తరపున బీసీలకి 42శాతం సీట్లు ఇవ్వాలని భావిస్తున్నారు. తద్వారా చట్టపరంగా అన్ని ప్రయత్నాలు చేసినా పరిస్థితులు అనుకూలించనందున ఇచ్చిన మాట ప్రకారం పార్టీపరంగా బీసీలకి 42శాతం ఇచ్చినట్లు చెప్పుకోవచ్చని ఆలోచన. ఇతర పార్టీలను రాజకీయంగా ఇరుకున పెట్టొచ్చనే వ్యూహం కనిపిస్తోంది. అన్ని అంశాలపై న్యాయనిపుణులు, ఉన్నతాధికారులు విశ్రాంత అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నేతలతో చర్చిస్తున్న ప్రభుత్వం ఐదారు రోజుల్లో వ్యూహం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

### లా విద్యార్థినిపై అత్యాచార ఘటన..

# సెక్యూరిటీగార్డు అరెస్ట్

హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్): పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సంచలనం సృష్టించిన లా కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో తాజాగా మరో కీలక అరెస్ట్ జరిగింది. బాధితురాలు చదువుతున్న సౌత్ కోల్‌కతా లా కాలేజీకి చెందిన సెక్యూరిటీ గార్డును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుతో ఈ కేసులో పట్టుబడిన నిందితుల సంఖ్య నాలుగుకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. సౌత్ కోల్‌కతా లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై ఇటీవల కళాశాల ప్రాంగణంలోనే సామూహిక అత్యాచారం జరిగింది. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే ఈ కేసుతో సంబంధం ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారిలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన ఓ స్థానిక నాయకుడు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. తాజాగా, ఈ కేసులో సెక్యూరిటీ గార్డు పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన గార్డే ఈ దారుణంలో పాలుపంచుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కళాశాల ఆవరణలోనే ఈ దారుణం జరగడం, అందులో రాజకీయ నాయకుడితో పాటు కాలేజీ సిబ్బంది ప్రమేయం కూడా ఉండటంపై విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# మారని పాక్ వంకర బుద్ధి

## ఉగ్ర శిబిరాలను మళ్లీ నిర్మిస్తున్న దాయాది

హైదరాబాద్ బ్యూరో, మెరిట్ :

కుక్క తోక వంకర అనే సామెత పాకిస్థాన్‌కు సరిగ్గా సరిపోతుంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ధ్వంసం చేసిన ఉగ్రవాద శిబిరాలను దాయాది దేశం మళ్లీ పునః నిర్మిస్తుండటమే అందుకు కారణం. పీవోకేతోపాటు దాని చుట్టపక్కల ప్రాంతాల్లో ఉగ్ర శిబిరాలను, శిక్షణ కేంద్రాలను దాయాది మళ్లీ నిర్మిసోందని జాతీయ మీడియా ఓ కథనం ప్రచురించింది. పాక్ సర్కార్, సైన్యం, నిఘా సంస్థ–ఐఎస్ఐ సహకారంతో ఈ నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ మేరకు జాతీయ మీడియా ఓ కథనం ప్రచురించింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ సహా దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉగ్ర శిబిరాల నిర్మాణాలు సాగుతున్నాయని తెలిపింది. భారత్ నిఘా, దాడుల నుంచి తప్పించుకునేందుకు దట్టమైన అడవుల్లో వాటిని నిర్మిస్తోందని వెల్లడించింది. గతంలో వాటిని లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ తదితర ఉగ్ర సంస్థలు ముష్కరులకు శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించేవని వివరించింది. లుని, జమిల్ పోస్టు, టిపు పోస్టు, జంగ్‌లోరా తదితరప్రాంతాల్లో ఉగ్ర క్యాంపులను పాక్ పునఃనిర్మిస్తోందని జాతీయ మీడియా పేర్కొంది. భారత రాడార్లు, ఉపగ్రహాల నుంచి తప్పించుకునేందుకు అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తున్నట్లు జాతీయ మీడియా తెలిపింది. కొత్తగా సర్ది, జురా, లిపా, కోట్లి, మందర్, జాన్‌కొటే తదితర ప్రాంతాల్లోనూ ఉగ్రవాద శిబిరాలను పాక్ నిర్మిస్తున్నట్లు పేర్కొంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను దృష్టిలో ఉంచుకొని మినీ ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను నిర్మించాలని పాక్ నిఘాసంస్థ ఐఎస్ఐ సూచించినట్లు తెలిసింది. సైనికులతో భద్రత ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్‌పుర్‌లో ఇటీవల ఐఎస్ఐ అధికారులు, ఉగ్రవాద సంస్థలకు చెందిన సీనియర్ కమాండర్ల మధ్య అత్యున్నతస్థాయి సమావేశం జరిగినట్లు భారత నిఘావర్గాలు గుర్తించాయి. పాకిస్థాన్‌తోపాటు కశ్మీర్‌లో మళ్లీ రిక్రూట్‌మెంటు ప్రారంభించాలని నిర్ణయించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఉగ్రవాదుల శిబిరాల నిర్మాణాలను ఐఎస్ఐ పర్యవేక్షిస్తోందని తెలిపింది.

# భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా బోనాల పండుగ జరుపుకుందాం

## ఏసిపి నరేష్ రెడ్డి పిలుపు






బాలానగర్(మేడ్చల్), జూన్ 28(మెరిట్): ఆషాఢం బోనాల జాతరకు ఆలయ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని,బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులలో ఎలాంటి అవంచానియా సంఘటనలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తల పై బాలానగర్ పోలీసులు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులతో శాంతి సమావేశం సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల పండుగ సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని అమ్మవారి స్ఫూర్తితో అందరూ శాంతియుతంగా బోనాల జాతరను జరుపకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. ఇందులో భాగంగా స్థానికులు పోలీ సులకు మద్దతుగా ఉంటూ రాబోయే బోనాల పండుగను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా చూడాలని,శాంతి భద్రతలను పరిరక్షించ డానికి బాలానగర్ ఖ్యాతిని కాపాడేందుకు ఉత్సవ కమిటీ సభ్యుల, నిర్వాహకులు అవిశ్రాంత కృషిని కొనసాగించాలని కోరారు. మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట, మహిళల భద్రత, ట్రాఫిక్ సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉండే నిర్వాహకులు తగిన సహకారం అందించాలన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నమన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా పటేల్ రెడ్డి, హాజీ మియా, నర్సింహులు, పిఎస్ఐలు వెంకటేశం,వినోద్, ఏఎస్ఐ హనుమయ్య, ఇతర సిబ్బంది ఆలయ కమిటీ సభ్యులు, బోనాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ముందు హాజరైన కొండా మురళి..

హైదరాబాద్ బ్యూరో, మెరిట్

వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గత కలహాలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయి. టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ముందు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హాజరై, తనపై వచ్చిన ఫిర్యాదులపై వివరణ ఇచ్చారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలైన కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు తదితరులపై కొండా మురళి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు.. ఈ కొత్త కంట్రొవర్శీకి కారణమయ్యాయి. కొండా దంపతులైన కొండా మురళి, కొండా సురేఖ.. కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్యం చెలాయిస్తున్నారనీ, స్థానిక నాయకులను అణచివేస్తున్నారని.. ఆ అసంతృప్త నేతలు ఆరోపిస్తూ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు.

**వివాదం ఎలా మొదలైంది?:**

కొండా మురళి, వరంగల్ ఈస్ట్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో కడియం శ్రీహరిని “కనుబొమ్మలు గీసుకునే నాయకుడు”గా, రేవూరి ప్రకాష్ రెడ్డిని “75 ఏళ్ల ముసలోడు”గా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు స్థానిక ఎమ్మెల్యేలను కలవరపరిచాయి. ఈ వ్యాఖ్యలతో పార్టీ ఐక్యతకు భంగం కలిగిందనీ, స్థానిక ఎన్నికల సన్నాహాలకు ముందు ఇలాంటి ప్రవర్తన హానికరమని ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ ఫిర్యాదులతో టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ, ఇవాళ గాంధీభవన్‌లో సమావేశమై, కొండా మురళి ని వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తప్పుదారి పట్టిస్తున్నా రని.. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు కూడా పార్టీలో వివాదానికి దారితీశాయి. ఆమె మంత్రి పదవి పోతుందని ప్రచారం మొదలైంది. ఈ ప్రచారాన్ని ఖండించిన కొండా మురళి.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వంటి నాయకులు తమ వెనుక ఉన్నారని అన్నారు. తమ శాఖలో ఆర్థిక పరిమితులున్నప్పటికీ తాము సమర్థంగా పనిచేస్తున్నామని అన్నారు.

**మంత్రి పొంగులేటిపై ఆరోపణలు**



**వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాలపై పట్టు:**

తమకు వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల నియోజకవర్గాల్లో బలమైన పట్టు ఉందని కొండా మురళి అన్నారు. ఈ ప్రాంతాల్లో కొండా దంపతులు గతంలో రాజకీయంగా చురుకైన పాత్ర పోషించారు. వరంగల్ జిల్లాలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఈ నియోజకవర్గాల్లో తమ ప్రభావం కీలకమని వారు భావిస్తున్నారు. అయితే, స్థానిక ఎమ్మెల్యేలు ఈ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ, కొండా దంపతులు పార్టీలో అంతర్గత ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**పొంగులేటిపై కొండా మురళి ఆరోపణలు**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కూడా కొండా మురళి తీవ్ర ఆరోపణలు చేశారు. పొంగు లేటి, తమపై కక్షతో కుట్రలు పన్నుతూ, వరంగల్ జిల్లాలోని వ్యతిరేక నాయకులను ఏకం చేస్తున్నారని ఆరోపించారు. పొంగులేటి, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉండగా.. ఈ ఆరోపణలు చేశారు. స్థానిక ఎన్నికల సన్నాహాల సమయంలో ఈ ఆరోపణలు పార్టీలో మరింత ఉద్రిక్తతను సృష్టించాయి.

**తెలంగాణ కాంగ్రెస్‌లో పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా.. జిల్లాల్లో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. రెండేళ్ల పాలన కూడా పూర్తవ్వకముందే.. నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ.. రచ్చ చేసుకుంటున్నారు. తాజాగా కొండా మురళి దంపతుల వ్యవహారం హాట్ టాపిక్ అయ్యింది.**

**కొండా మురళి వాదన:**

కొండా మురళి, తనపై వచ్చిన ఫిర్యాదులను ఖండిస్తూ, తన వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచేందుకు మాత్రమేనని, వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచే ఉద్దేశంలేదని వాదించారు. తన భార్య కొండా సురేఖ మంత్రిగా సమర్థంగా పనిచేస్తున్నారనీ, కొందరు నాయకులు ఆమెను రాజకీయంగా బలహీన పరచడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గాంధీ భవన్‌లో జరిగిన క్రమశిక్షణా కమిటీ సమావేశంలో ఈ విషయాలను వివరించినట్లు సమాచారం.

# చెత్త కామెంట్లు చేయొద్దు

సోషల్ మీడియాలో తన శరీరాకృతిపై వస్తున్న కామెంట్లకు ప్రముఖ నటి సమంత తనదైన శైలిలో గట్టి సమాధానం ఇచ్చారు. తనను విమర్శించే వారికి ఆమె ఓ ఫిట్‌నెస్ సవాల్ విసిరారు. జిమ్‌లో తాను పుల్–అప్స్ చేస్తున్న వీడియోను పంచుకుంటూ, తనపై కామెంట్ చేసే ముందు కనీసం మూడు పుల్–అప్స్ తీసి చూపించాలని, అలా చేయలేని పక్షంలో తన గురించి మాట్లాడటం మానేయాలని ఘాటుగా స్పందించారు. ఇటీవల ఓ అవార్డుల కార్యక్రమానికి సమంత హాజరయ్యారు. అక్కడ నటిశ్రీలీలతో కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలనుచూసిన కొందరునెటిజన్లు, సమంత బాగా సన్నబడ్డారని, అనారోగ్యంగా కనిపిస్తున్నారంటూ కామెంట్లు చేశారు. కొంతకాలంగా తన లుక్స్‌పై వస్తున్న ఇలాంటి విమర్శలకు సమాధానంగా సమంత తాజాగా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ వీడియో పోస్ట్ చేశారు.

ఆ వీడియోలో సమంత జిమ్‌లో ఎంతో శ్రమిస్తూ పుల్–అప్స్ చేయడం కనిపిస్తుంది. దీనికి ఆమె ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. "ఒక డీల్ చేసుకుందాం. 'సన్నబడ్డావు', 'ఆరోగ్యం బాలేదా?' లాంటి చెత్త కామెంట్స్ నాపై చేసే ముందు, మీరు కనీసం మూడు పుల్–అప్స్ చేయగలగాలి. ఒకవేళ మీరు ఆ పని చేయలేకపోతే, దయచేసి నా గురించి అలా మాట్లాడకండి," అంటూ తన విమర్శకులకు సవాల్ విసిరారు. కొంత కాలంగా సమంత మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడుతున్న విషయం తెలిసిందే. 2022లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు ఆమె స్వయంగా వెల్లడించారు. అప్పటి నుంచి చికిత్స తీసుకుంటూనే, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.



## వామ్మో, ప్రియాంక చోప్రా రెమ్యునరేషన్ తెలిస్తే షాకవుతారు

ఇంటర్నేషనల్‌గా ఫేమస్ అయిన ఇండియన్ సెలబ్రిటీలు చాలా తక్కువ మందే ఉన్నారు.అయితే టాలెంట్, గ్లామర్ ప్యాకేజీతో ఇండియాలోనే కాకుండా గ్లోబల్ రేంజ్‌లో పాపులర్ అయింది ఒక హీరోయిన్.ఆమె ఆరేళ్లుగా బిగ్ స్క్రీన్‌పై కనిపించకపోయినా, ఇప్పుడు ఒక తెలుగు సినిమాకు రూ.30 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటోంది. ఆమె ఎవరో కాదు, మహేష్‌బాబు, రాజమౌళి కాంబో ప్రాజెక్ట్ హీరోయిన్ ప్రియాంక చోప్రా. ప్రియాంక చోప్రా సినీ కెరీర్ స్లోగానే స్టార్ట్ అయినా.. చాలా తక్కువ టైమ్‌లోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ప్రతి సినిమాలో యూనిక్ యాక్టింగ్ స్టైల్‌తో ఆకట్టుకుంటోంది.అందం, యాక్టింగ్ స్కిల్స్‌లో బాలీవుడ్‌లో తన ప్లేస్‌ను ఫిక్స్ చేసుకుంది. అయితే ఆమె కేవలం ఒక్క ఇండస్ట్రీకో, ఒక దేశానికో పరిమితం కాలేదు.. అద్భుతమైన నటన, సినిమా సెలక్షన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రియాంక చోప్రా ఆరేళ్ల తర్వాత మళ్లీ బిగ్ స్క్రీన్‌పై కనిపించనుంది. 'బాహుబలి' ఫేమ్ ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా రాబోతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'SSMB 29'లో ఆమె హీరోయిన్. బాలీవుడ్ హంగామా రిపోర్ట్స్ ప్రకారం..ఈ మూవీ కోసం ప్రియాంక రూ.30కోట్ల రెమ్యునరేషన్ అడిగింది.ఇది ఇండియాలో హీరోయిన్లకు హయ్యెస్ట్ రెమ్యునరేషన్.

## డిసిపి కె.సురేష్‌కు ఉత్కృష్ట సేవా పతకం ప్రధానం



బాలానగర్(మేడ్చల్), జూన్ 28(మెరిట్):

బాలానగర్ డిసిపి కొల్లూరు సురేష్ కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకం ప్రదానం అందించింది. గత 15 సం.లుగా శాంతి భద్రతలు కమ్యూనిటీ పోలిసింగ్, మావోయిస్ట్ నిరోధక కార్యకలాపాలలో భాగంగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు ప్రకటించింది. ప్రత్యేకంగా ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్ట్ కార్యకలాపాలు నిరోధించుటలోను, ఆసిఫాబాద్ జిల్లాలో కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా అనేక సేవ కార్యక్రమాల ద్వారా ఆయన గుర్తింపుపొందారు. ప్రతిష్ఠాత్మక ఈ అవార్డు పొందినందుకు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, బంధు మిత్రులు అభినందించినారు.

## విద్యార్థులు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

### ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం..



శంఖవరం, మెరిట్

ప్రతి విద్యార్థి విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జనసేన నాయకులు, రైల్వే డివిజన్ సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొంతంగి కొత్తూరు గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ఆదేశాల వరకు శనివారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల" పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి విద్య పై ఆసక్తి చూపి ఉన్నత శిఖరాలు అధిరోహించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేసిన సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లో ఉన్న పుస్తకాలు, నోటుబుక్లు, స్కూల్ బ్యాగ్, బూట్లు, బెల్టులు, డిక్ష నరీలు వంటి సామగ్రి విద్యార్థులపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు నిదర్శనం. ఇది కేవలం సామాన్య పంపిణీ కార్యక్రమం కాదు అని ఇది వారి భవిష్యత్తు నిర్మాణానికి ఒక పునాది" అని వివరించారు. పేదల పిల్లలకూ ప్రైవేట్ విద్యాసంస్థల విద్యా ర్హతలు అందించాలన్న సంకల్పంతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. "విద్యారంగానికి మరింత ప్రాధాన్యత ఇస్తూ, నాణ్యమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకం, పాఠశాల అభివృద్ధికి నిధుల కేటాయింపు వంటి అంశాలపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది" అని తెలిపారు. చదువులో రాణించి డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు కావాలన్న కలలు కంటున్న విద్యార్థులకు ఈ కిట్లు ప్రోత్సాహంగా నిలుస్తాయని, రాబోయే కాలంలో ఈ పిల్లలు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శివాజీ, ప్రధానోపాధ్యాయులు ఎన్ రామేశ్వర రావు, విద్యా కమిటీ చైర్మన్ కే లావణ్య, ఉపాధ్యాయులు తోట సీతారామయ్య, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం..

### ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్):



ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకునే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.కొత్తగా నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించేందుకు ఓ పౌరుడి నుంచి రూ. 5,000 లంచం స్వీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సుల్తానా బాద్‌కు చెందిన ఒక వ్యక్తి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనపర్తి వినోద్ కుమార్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ కుమార్ రూ.5,000 లంచం డిమాండ్‌చేశారు.లంచంఇవ్వడం ఇష్టంలేని ఆ వ్యక్తి నేరుగా తెలంగాణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, ఫిర్యాదుదారుడు శుక్రవారం నాడు కార్యాలయంలో వినోద్‌కుమార్,విజయ్‌కుమార్‌లకు రూ.5,000 ఇస్తుండగా..అక్కడే మాటు వేసిన ఏసీబీబృందంవారిని అదుపులోకితీసుకుంది.లంచండబ్బును స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సేవలు అందించడానికి లంచం అడిగితే ఏమాత్రం భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా గానీ, ఫేస్‌బుక్ (Telangana ACB),ఎక్స్ (@TelanganaACB) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గానీ, అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు. లంచంపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి..

### 16 మంది సైనికుల మృతి

హైదరాబాద్ బ్యూరో, జూన్ 28(మెరిట్):

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయని,ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్టు పాకిస్థానీ తాలిబన్‌కు చెందిన హఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ పదేపదే ఆఫ్ఘనిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది.

## పసిడి ధరలు ఇంకా భారీగా తగ్గబోతున్నాయా!?

హైదరాబాద్ బ్యూరో, మెరిట్ :



పసిడి ప్రియులు ఎగిరి గంతేసే వార్త.. బంగారం ధరలు సామాన్యులకు అందుబాటులోకి రానున్నాయి. మొన్నటి దాకా కొండెక్కిన ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టేందుకు రెడీగా ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడి దారులు పసిడిని సురక్షిత డిమాండ్ నుంచి పక్కన బెట్టి వేరే అంశాలపై దృష్టి సారించారు. దీంతో బంగారం ధర తగ్గుతోంది. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర 10 గ్రాములకు రూ.930 తగ్గి రూ.97,670కి చేరుకుంది. బంగారం వ్యాపారులు అమ్మకాలు జరపడంతో.. వచ్చేవారం కూడా బంగారం ధర తగ్గుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్–ఇరాన్ కాల్పుల విరమణ తర్వాత, పశ్చిమాసియాలో ఉద్రిక్తత తగ్గే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీని కారణంగా, పెట్టుబడి దారులు బంగారం నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ప్రపంచ స్థాయిలో రాజకీయ రిస్క్ తగ్గడం, బలమైన ప్రపంచ వాణిజ్య ఆశావాదం కారణంగా బంగారం ధరలు తగ్గాయని రిలయన్స్ సెక్యూరిటీస్ నిపుణుడు జిగర్ త్రివేది అన్నారు. ఈ పరిస్థితులలో పెట్టుబడిదారులలో సురక్షితమైన పెట్టుబడి కోసం బంగారం మీద దృష్టిని పెట్టాలనే కోరిక ఇప్పుడు తగ్గిందని చెబుతున్నారు. ఈ పరిస్థితులు ఇలా ఉంటే.. వచ్చే వారం పసిడి ధరపై అనేక అంశాలు ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికా, యూరోపియన్ ప్రాంతంలో ఆర్థిక డేటా విడుదల కానుంది. రాబోయే వారానికి బంగారం మార్పులకు ఇవి ప్రధాన కేంద్ర బిందువులు అవుతాయని జిగర్ త్రివేది అన్నారు. జిగర్ త్రివేది ప్రకారం– కామెక్స్ బంగారం ఔన్సుకు 3,230 నుంచి 3,200 డాలర్ వద్ద ట్రేడ్ అవుతుందని భావిస్తున్నారు. ఆగస్టు ఫ్యూచర్స్ కోసం MCX బంగారం ధర 10 గ్రాములకు రూ. 94800– రూ 94000 వరకు తగ్గుతుందని భావిస్తున్నారు. ఇక ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గింపు గురించి మరిన్ని సూచనల కోసం పెట్టుబడిదారులు US వ్యక్తిగత వినియోగ వ్యయం (PCE) ధర సూచిక డేటా విడుదల కోసం ఎదురు చూస్తున్నారంటూ ఆనంద్ రతి షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ (కమోడిటీస్ & కరెన్సీస్) మనీష్ శర్మ తెలిపారు. ఈ పరిణామాలన్నీ బంగారం ధరలు తగ్గే అవకాశాలను కల్పిస్తున్నాయని చెబుతున్నారు. ఇక జూలై 9 నాటికి తీసుకోబోయే అమెరికా టారిఫ్ నిర్ణయం కీలకంగా మారనుంది. చివరిగా బంగారం కొనుగోలు చేసే వారు, ఇన్వెస్ట్ చేసేవారు గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే... ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుండటంతో, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తక్కువయ్యాయి. అంతర్జాతీయంగా వాణిజ్య సంబంధాల్లో సానుకూల అభివృద్ధి కనిపిస్తోంది. దీనివల్ల బంగారం ధరలు అంతర్జాతీయంగా, MCX మార్కెట్లలో భారీగా పడిపోయాయి.ఇక మరో వైపు, అమెరికన్ డాలర్ కూడా 1.5% పడిపోయి 97.3 దిగువకు చేరింది. ఇది 2022 ఫిబ్రవరి తర్వాత కనిష్ట స్థాయిగా చెప్పొచ్చు. బంగారం కొనుగోలు చేయాలని చూస్తున్న వారు, ధరలు ఇంకా మరింత తగ్గే అవకాశముండటంతో కొంతకాలం వేచి చూడటం మంచిదనే అభిప్రాయాన్ని నిపుణులు సూచిస్తున్నారు.